

ఉక్కులో మరో 340 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు!

నేడు పాతగాజువాకలో ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు కొనసాగుతోంది. శుక్రవారం 250 మంది కార్మికులను ఆపేసిన యాజమాన్యం, శనివారం మరో 340 మంది బయోమెట్రిక్‌ను నిలిపివేసినట్టు తెలిసింది. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాతగాజువాకలో భారీఎత్తున ధర్నా చేపట్టనున్నట్టు ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ప్రకటించారు. భారీఎత్తున కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

బే వాచ్‌లో నిబంధనలు బేఖాతరు

అన్నీ అడ్డగోలు వ్యవహారాలే

- బీచ్‌లో 40 సెంట్ల స్థలం ఆక్రమణ
- వెదురు కట్టడాలను కూల్చి పక్కా నిర్మాణాలు
- మహిళల రెస్ట్‌రూమ్ పడగొట్టి కేఫ్‌టేరియా
- అధిక ధరకు మద్యం అమ్మకం
- నివేదిక సమర్పించినా పట్టించుకోని ప్రభుత్వం
- లీజుదారుడి నుంచి చేతులు మారిందనే విషయం నివేదికలో పొందుపరచని అధికారులు
- వైసీపీ నాయకుల సబ్ లీజులో పర్యాటక ఆస్తి



కాపులుప్పాడలోని 'బే వాచ్'

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నాయకుల దోపిడీపై కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ చేపట్టి చర్యలు చేపడుతున్నారు. కానీ, విశాఖపట్నంలో మాత్రం చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. కాపులుప్పాడలో పర్యాటక సంస్థకు చెందిన 'బే వాచ్' చేతులు మారినా పట్టించుకోకపోవడమే అందుకు నిదర్శనం. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఒకరికి దానిని లీజుకు ఇస్తే వారి నుంచి వైసీపీ నాయకులు సబ్ లీజుకు తీసుకొని గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్నారు. రూపురేఖలు మార్చేశారు. నిబంధనలు ఉల్లంఘించారు. బీచ్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమించారు. అవన్నీ విచారణలో ఐదు నెలల క్రితమే బయటపడినా వారిపై ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు లేవు. ఇంత ఉదాసీనంగా ఎందుకు ఉన్నారో అర్థం కాని అంశం.

భీమిలి మండలం కాపులుప్పాడలో తొట్ల కొండ ఎదురుగా బీచ్‌లో సర్వే నంబరు 314/పిలో 2.16 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటక శాఖ నిర్మించిన బీచ్ ఫ్రంట్ అండ్ షాక్స్-బే వాచ్‌ను 2017 ఆగస్టులో డీవీవీఎల్ఎన్ మూర్తికి ఏపీటీడీసీ లీజుకు ఇచ్చింది. ఆ ప్రాంతం కోస్తా నియంత్రణ మండలి-3లో ఉంది. శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే దానిని వైసీపీ అధికారంలోకి వచ్చాక ముగ్గురు నేతలు కలిసి సబ్ లీజుకు తీసుకున్నారు. అది చేతులు మారిన తరువాత వెనుకనున్న బీచ్‌లో 40 సెంట్ల భూమి ఆక్రమించారు. కాంక్రీట్‌తో సకల సౌకర్యాలతో ఎనిమిది గదులు నిర్మించారు. వాటిని రోజుకు రూ.2 వేలకు అద్దెకు ఇస్తున్నారు. మహిళల రెస్ట్ రూమ్‌లకు ఉద్దేశించిన నిర్మాణాలను కూలగొట్టి కేఫ్‌టేరియా నిర్మించారు. ఒక గుడిసె స్థానంలో బార్ ఏర్పాటు చేశారు. అక్కడ మద్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారు. వీటిపై జనసేన నాయకులు పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. గత ఏడాది సెప్టెంబరులో జిల్లా పర్యాటక శాఖ అధికారిని జ్ఞానవేణి బే వాచ్‌కు వెళ్లి విచారణ చేశారు. ఫిర్యాదీ మూర్తి యాదవ్‌ను, రెస్టారెంట్ మేనేజర్‌ను, లీజుకు తీసుకున్న మూర్తిని పిలిచి మాట్లాడారు. మొత్తం అంతా చూసి పర్యావరణ అనుమతులు తీసుకోకుండా కొత్త నిర్మాణాలు చేపట్టినట్టు నిర్ధారించారు. మండల సర్వేయర్‌తో సర్వే చేయించి 40 సెంట్లు బీచ్‌ను వెనుక ఆక్రమించి, దానిని ఉపయోగించుకున్నట్టు తేల్చారు. అనధికారంగా స్విమ్మింగ్ పూల్ నిర్మించినట్టు గుర్తించారు. అలాగే పార్కింగ్ ఏరియాలో బాక్స్ క్రికెట్ నిర్వహిస్తున్నట్టు నివేదికలో పొందుపరచారు. సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించినట్టు తేల్చారు. లీజు ఒప్పందానికి వ్యతిరేకంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టిన విషయం నిర్ధారించారు. లిక్కర్‌ను ప్రభుత్వం సూచించిన ధరల కంటే ఎక్కువగా అమ్ముతున్నట్టు, లెక్కల్లో తేడాలు ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే ఎనిమిది ... మిగతా 6వ పేజీలో



బేవాచ్‌లో బార్

ఎన్ఆర్ఐ మహిళ మృతిపై మిస్టరీ

- ఆత్మహత్యగా పేర్కొంటున్న పోలీసులు
- హోటల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామంటూ ప్రకటన
- పోలీసుల తీరుపై సర్వత్రా అనుమానాలు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మేఘాలయ హోటల్‌లో ఎన్ఆర్ఐ మహిళ (48) అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల ఆరో తేదీ మధ్యాహ్నం 1.15 గంటలకు రూమ్ నంబర్ 229లో మహిళ మృతి చెందినట్టు హోటల్ సిబ్బంది త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే, పోలీసులు శనివారం వరకూ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అత్యంత గోప్యంగా ఉంచారు. పైగా శుక్రవారం సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు వివరాలు కోరితే, అలాంటి ఘటన ఏదీ జరగలేదంటూ బుకాయించారు. చివరకు 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వార్త రావడంతో పోలీసులు హడావిడిగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో ఉంటున్న 48 ఏళ్ల ఎన్ఆర్ఐ మహిళ హోటల్ మేఘాలయ హోటల్‌లోని రూమ్ నంబర్ 229లో బాత్‌రూమ్‌లో షవర్ హెడ్‌కు ఉరివేసుకుని మృతిచెందారని పేర్కొన్నారు. అదే ప్రకటనలో హోటల్ మేనేజర్ ఇచ్చిన ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.08
సహరి (సోమ)	4.53

ప్రభుత్వ భూమి కబ్జా

దర్గాగా కల్యాణ మండపం నిర్మాణం

వైసీపీ నేత కుమారుడి అండదండలు



గాజువాక బీసీరోడ్డుని ఆనుకుని సర్వేనంబర్ 43/1డీలోని ప్రభుత్వస్థలంలో నిర్మిస్తున్న కల్యాణమండపం

- చర్యలు తీసుకునేందుకు వెళ్లిన టౌన్‌ప్లానింగ్ అధికారులకు బ్రేకులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- గాజువాకలో అరాచకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలైనా గాజువాక నియోజకవర్గంలో కొందరు రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు ఇంకా వైసీపీ నేతల కనుసన్నల్లోనే నడుచుకుంటున్నారు. దయాల్‌నగర్ కొండను వైసీపీ ముఖ్య నేత కుమారుడు తన సొంత జాగీరుగా మార్చేసుకున్నా పట్టనట్టు వ్యవహరించిన రెవెన్యూ అధికారులు, తాజాగా ఆయన అండతో ప్రభుత్వ భూమిలో జరుగుతున్న భారీ కల్యాణ మండపం పనులకు తమ వంతు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గాజువాక బీసీ రోడ్డును ఆనుకుని దయాల్ నగర్ కొండ సమీపాన సర్వే నంబర్ 43/1డిలో ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని ఆనుకుని వైసీపీకి చెందిన కార్పొరేటర్ (ప్రస్తుతం టీడీపీలో చేరిపోయారు) అనుచరుడికి కొంత స్థలం ఉంది. అనుచరుడి పేరుతో ఉన్నప్పటికీ కార్పొరేటర్‌దేనని స్థానికులు చెబుతుంటారు. తన అనుచరుడి పేరిట ఉన్న ఆ స్థలానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కలిపేసుకుంటే అక్కడ భారీ కల్యాణ మండపం (కన్వెన్షన్ సెంటర్) నిర్మించవచ్చునని సదరు కార్పొరేటర్ భావించారు. అనుకున్నదే తడవుగా తనకు అత్యంత ఆప్తుడు, ఆ ప్రాంతంలో పెద్దఎత్తున దందాలకు పాల్పడుతున్న వైసీపీ నేత కుమారుడిని కలిశారు. తన వాటా తనకు ఇచ్చేస్తే సంపూర్ణ సహకారం అందిస్తానని వైసీపీ నేత కుమారుడు భరోసా ఇచ్చారు. ఇద్దరి మధ్య ఒప్పందం కుదరడంతో తన అనుచరుడి పేరుతో ఉన్న స్థలంతోపాటు దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కలిపేసుకుని భారీ కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనిపై కొందరు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎలాంటి ... మిగతా 6వ పేజీలో

ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

150 గజాల వరకూ ఉచితం

కలెక్టర్

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు 150 గజాల వరకూ ఆక్రమణలకు ఉచితంగా కన్వేయన్స్ డీడ్ జారీ చేస్తామన్నారు. 151 గజాల నుంచి 300 గజాల వరకూ బేసిక్ విలువపై 15 శాతం, 301 నుంచి 450 గజాల వరకు దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలు బేసిక్ విలువపై 100 శాతం, పైనున్న కుటుంబాలు 200 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఇంకా 451గజాలు, ఆపై ఉన్న ఆక్రమణల క్రమబద్ధీకరణకు అన్ని వర్గాలు బేసిక్ విలువకు ఐదు రెట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసిన రెండు నెలల్లో చలానా రూపంలో రుసుం చెల్లించాలన్నారు. దరఖాస్తులు గ్రామ, వార్డు సచివాలయాలు, తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుతోపాటు రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఆస్తిపన్ను రశీదు, కరెంటు బిల్లు, నీటిపన్ను రశీదు,ఆక్రమణలకు సంబంధించి ఇతర పత్రాలు జతచేయాలని సూచించారు.దరఖాస్తులను మండల, డివిజన్‌స్థాయిల్లో కమిటీలు పరిశీలించి ఆమోదిస్తాయని పేర్కొన్నారు.

వీఎంఆర్‌డీఏ ప్లాట్లు, ఫ్లాట్లు వేలం

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) గతంలో వేసిన లేఅవుట్లు, హౌసింగ్ ప్రాజెక్టులలో మిగిలిపోయిన వాటిలో కొన్ని ప్లాట్లు, ఫ్లాట్లను మళ్లీ ఈ-వేలానికి పెట్టింది. మారికవలస హరిత హౌసింగ్ ప్రాజెక్టులో నాలుగు ఫ్లాట్లు, కూర్మన్నపాలెం హౌసింగ్ లేఅవుట్‌లో 4 ఫ్లాట్లు, కాపులుప్పాడ హౌసింగ్ లేఅవుట్‌లో మరో నాలుగు ఫ్లాట్లను అమ్మకానికి ఉంచింది. ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఇదే నెల 27న ఈ-వేలం నిర్వహిస్తుంది. ఇక ప్లాట్ల విషయానికి వస్తే దాకమర్రి లేఅవుట్‌లో 30 ప్లాట్లు, పాలవలస ఎంఐజీ లేఅవుట్‌లో 30 ప్లాట్లు, మధురవాడ ఓజోన్‌వేలీ, సైబర్ వేలీ లేఅవుట్లలో 32 ప్లాట్లు, పరవాడ మండలం చీపురుపల్లి జాయింట్ వెంచర్ లేఅవుట్‌లో 30 ప్లాట్లు, కూర్మన్నపాలెం ఫేజ్-1, పెదగంట్యాడ ఫేజ్-1 లేఅవుట్లలో 22 ప్లాట్లు అమ్మకానికి ఉంచింది. వీటికి ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి 31వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు లేఅవుట్ల వారీగా ఈ-వేలం నిర్వహిస్తుంది. ఇతర వివరాలకు ఏపీ ప్రభుత్వానికి చెందిన కొనుగోళ్ల పోర్టల్ పరిశీలించాలని వీఎంఆర్‌డీఏ పేర్కొంది.

తమన్నా సందడి



రాడిసన్ బ్లూ హోటల్‌లో శనివారం రాత్రి జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న సినీ నటి తమన్నా భాటియా

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చొరవ



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీలోని ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్తలకు చెక్కులను అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయస్వామి. చిత్రంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఉన్నారు.

- భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శక్తి యాప్
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయస్వామి
- అన్ని విధాలుగా చేయూతనిస్తాం: ఎమ్మెల్యేలు
- మహిళలకు ఏ సమస్య వచ్చినా తన వ్యక్తిగత నంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్న పోలీస్ కమిషనర్
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సిరిపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శనివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ... మిగతా 6వ పేజీలో



మహిళ నడుపుతున్న ఎలక్ట్రిక్ ఆటోలో ప్రయాణిస్తున్న మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్

పీ4 సర్వే ప్రారంభం

- జిల్లాలో ఈ నెల 18 వరకూ నిర్వహణ
- బాగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాల గుర్తింపు
- గ్రామ, వార్డు సభల్లో వివరాల వెల్లడి
- అత్యంత పేదలకు అండగా నిలవడమే ధ్యేయం
- ఇప్పటివరకూ అందుకుంటున్న సంక్షేమ పథకాలపై ఎటువంటి ప్రభావం చూపబోదని కలెక్టర్ స్పష్టీకరణ

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు ప్రస్తుతం ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు అమలుచేస్తోంది. అయితే పేదలను మరింత ఆదుకునేందుకు పీ4 సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది అత్యంత పేదలకు గుర్తించనున్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సాయం పొందుతున్న కుటుంబాల వివరాలు గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉన్నాయి. వాటి ఆధారంగా జిల్లాలో శనివారం నుంచి పీ4 సర్వే ప్రారంభించారు. ఈనెల 18వ తేదీ వరకు చేపట్టనున్న సర్వేలో అత్యంత పేదలను గుర్తించేందుకు అవసరమైన వివరాలను సేకరిస్తారు. ఇందుకు 27 అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకు ప్రత్యేకంగా యాప్ రూపొందించిన ప్రభుత్వం, సర్వే చేసే వార్డు/గ్రామ సచివాలయాల సిబ్బందికి అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో ఏడు లక్షలకు పైచిలుకు ఉన్న కుటుంబాల వివరాలను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదుచేసి అప్‌లోడ్ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ, పిల్లల చదువు కోసం అనేకమంది బియ్యం కార్డులు తీసుకున్నారు. పీ4 సర్వే చేసేటప్పుడు బియ్యం కార్డుదారులందరినీ కాకుండా వారిలో బాగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలనే ఎంపిక చేస్తారు. ఆ వివరాలను ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో సభలు ఏర్పాటుచేసి వెల్లడిస్తారు. తరువాత ఉగాది రోజున సీఎం చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలన కోసం కార్యక్రమం ప్రారంభిస్తారు. అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించి అత్యంత పేదలను ఆర్థికంగా పైకి తీసుకువచ్చే ప్రణాళిక అమలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో చేపడుతున్న పీ4 సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కోరారు. ఇప్పటివరకూ అందుకుంటున్న సంక్షేమ పథకాలపై ఈ సర్వే ఎటువంటి ప్రభావం చూపదని ఆయన స్పష్టంచేశారు. సర్వేకు సంబంధించి ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలను ఇందుకు నిర్దేశించిన క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలన్నారు.



పీ-4 సర్వే చేస్తున్న సిబ్బంది

వృద్ధులకు భోజన వితరణ



వృద్ధురాలికి భోజనం అందిస్తున్న విద్యుత్‌శాఖ ఏఈఈ శైలజ తదితరులు

మధురవాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా మధురవాడ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కృష్ణానగర్‌లో ఉన్న వద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం మధ్యాహ్న భోజనం సమకూర్చారు.సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్‌.ఎల్‌. నాయుడు, అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, విద్యుత్‌ శాఖ ఏఈఈ అల్లు శైలజ తదితరులు పాల్గొన్నారు.మహిళా దినోత్సవం సంధర్భంగా ఆశ్రమంలో మహిళలను సంఘం సభ్యులు అభినందించారు.

నేటి నుంచి పోలమాంబ ఉత్సవాలు

తగరపువలస, మార్చి 08 (ఆంధ్రజ్యోతి) సంగివలస పోలమాంబదేవాలయంలో జాతర ఉత్సవాలను ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్టు దేవదాయ, ధర్మదాయశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మూడుగుడ్ల అమ్మవార్లుగా పేరున్న ఈ దేవాలయంలో ఈ మూడురోజుల పాటు తమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 16న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ ఈ జాతర సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

భీమునిపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భీమిలి పోలీసుస్టేషన్‌కు పదో తరగతి ప్రశ్నపత్రాలు శనివారం ఉదయం చేరుకున్నాయి. ఈనెల 17 నుంచి టెన్త్‌ పబ్లిక్‌ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కాగా, శనివారం మండల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు వాటిని పరిశీలించి, క్రమ పద్ధతిలో చేర్చి పీఎస్‌లోభద్రపరిచారు.

ఇద్దరు మహిళలు అరెస్టు

మహారాణిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించి ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు టూటౌన్‌ పోలీసులు తెలిపారు. అచ్చియ్యమ్మ పేటలో బి.సుగుణ అనే మహిళ తనకు అప్పు ఇచ్చిన వారి ఇంటిలోనే ఈ నెల 6నఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఉమ్మడి ధనలక్ష్మి, వాసుపల్లి నూకరత్నం లను అరెస్టు చేసినట్లుపోలీసులు తెలిపారు.

అంగరంగ వైభవంగా సీతారాముల శోభాయాత్ర

» ప్రవచనాల ముగింపు సందర్భంగా అశ్వరథంపై విగ్రహాల ఊరేగింపు, శ్రీరామపట్టాభిషేకం

కొమ్మాది, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నామస్మరణ ఎంతో శక్తివంతమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త,బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్‌ కళాశాల ఆవరణలో నలభై రెండు రోజుల పాటు నిర్వహించిన సంపూర్ణ రామాయణం ప్రవచనాల ముగింపు సందర్భంగా సీతారాముల హోమం, సీతారాముల కల్యాణం, సీతారాముల శోభాయాత్ర, పట్టాభిషేకం నిర్వహించారు. హోమం సందర్భంగా సుగంధద్రవ్యాలతో



పట్టాభిషేకం అనంతరం సీతారాముల విగ్రహాలకు హారతి ఇస్తున్న చాగంటి



కోలాటాలు, భక్తుల ఆటపాటల మధ్య అశ్వరథాన్ని నడుపుతున్న చాగంటి

నిర్వహించారు. అనంతరం వైభవం సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాయంకాలం గాయత్రి ఇంజనీరింగ్‌ అటానమస్‌ కళాశాల నుంచి అంగరంగవైభవంగా సీతారాముల విగ్రహాలను అశ్వరథంపై ఉంచి చాగంటి కోటేశ్వరావు సారథిగా వ్యవహరిస్తూ సుమారు నాలుగు వేల మందితో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర ఆసాంతం భజనలు, కోలాటం, నృత్యాలు, ఆటపాటలతో పాటు మహిళలు పసుపునీళ్లు చల్లుతుండగా సాగింది.

అనంతరం సీతారాముల పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో గాయత్రి విద్యాపరిషత్‌ కార్యదర్శి ఆచార్య సోమరాజు, అష్టలక్ష్మీదేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

యువత సేవాభావాన్ని అలవరచుకోవాలి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్

మధురవాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు కార్పొరేటర్‌, జీవీఎంసీ స్టాండింగ్‌ కమిటీ మెంబర్‌ పిళ్లా మంగమ్మ, వెంకటరావు కుమారుడు పిళ్లా భరత్‌కుమార్‌ 31వ జయంతిని పిల్లకోమటి వానిపాలెంలోశనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌ ట్రస్టు సహకారంతోవైద్యశిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు మహిళలకు చీరలు అందజేశారు. యువతలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి వాలీబాల్‌ పోటీలు నిర్వహించారు.అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాలీబాల్‌ పోటీలను ప్రారంభించారు. రక్తదానం చేస్తున్న యువతను అభినందించారు.పిళ్లా భరత్‌కుమార్‌ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ



రక్తదానం చేస్తున్న యువతను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా

సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్‌ మాట్లాడుతూ భరత్‌ పేరుతో నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. యువత రక్తదానం లాంటి కార్యక్రమాల్లో పాల్గొని సేవాతత్పరత అలవరచుకోవాలన్నారు. భరత్‌ పేరుతో మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కార్పొరేటర్‌ మంగమ్మలను గంటా అభినందించారు.

మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ స్వాధీనం



పోలీసులు సీజ్‌ చేసిన వాహనాల్లో ఒక ట్రాక్టర్‌

పద్మనాభం, మార్చి8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పద్మనాభం సీఐ సీహెచ్‌ శ్రీధర్‌ శనివారం రాత్రి చెప్పారు. ఆయన చెప్పిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని రెడ్డిపల్లి కొత్త చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఘటా స్థలాన్ని పరిశీలించినట్టు చెప్పారు. అక్కడ మట్టి తరలింపునకు ఉంచిన వాహనాలను పట్టుకొని సీజ్‌ చేశామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం పద్మనాభం తహసీల్దారు, మండల మెజిస్ట్రేటుకు కేసు వివరాలు సమర్పించినట్టు సీఐ చెప్పారు.

సింహాద్రి నాథునికి నిమ్మగడ్డ పూజలు

సింహాచలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్‌ కాలేజీ ఆఫ్‌ ఇండియా డైరెక్టర్‌ జనరల్‌, రాష్ట్ర విశ్రాంత ఛీఫ్‌ ఎలక్షన్‌ కమిషనర్‌ డా.నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ కుటుంబ సమేతంగా సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు



ఆలయంలో నిమ్మగడ్డ దంపతులు

ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. సతీసమేతంగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న నిమ్మగడ్డ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు అప్పన్నకు అష్టోత్తర శతనామార్చన చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు.

రూ.38 లక్షలతో బాలుర వసతిగృహం ఆధునికీకరణ



మధురవాడలోని సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతిగృహం

» సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతికి నూతన హంగులు
» 2015లో నిర్మాణం.. మరమ్మతులకు గురైన గదులు, వసతులు
» 3 నుంచి 10 తరగతుల విద్యార్థులు 120 మందికి ఆశ్రయం
» అధునిక వసతుల ఏర్పాటుతో వారంతా ఆనందం

మధురవాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మధురవాడ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతిగృహాన్ని రూ.38 లక్షలతో వివిధ నిర్మాణ పనులు చేపట్టి ఆధునీకరించారు. 2015లో నిర్మించిన ఈ వసతిగృహంలో మరుగుదొడ్లు, పడక గదులు, కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. ఈ వసతిగృహంలో 3 నుంచి పదో తరగతి వరకు చుదువుతున్న 120 మంది విద్యార్థులు ఉంటున్నారు. వసతిగృహం ఆధునీకరణకు సాంఘిక సంక్షేమ శాఖ రూ.38 లక్షలు కేటాయించినట్టు ఆ శాఖ డీఈ నాగ సత్యనారాయణ తెలిపారు. ఈ నిధులతో ప్రస్తుతం చురుగ్గా పనులు జరుగుతున్నాయి. మరుగుదొడ్లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం అదనంగా వాటర్‌ ట్యాంక్‌ ఏర్పాటు చేశారు. కాలువలు నిర్మించారు, డార్మిటరీలను ఆధునీకరించారు. కొన్ని గదుల్లో ద్వారాలు, కిటీకీలు మార్పుచేశారు. అన్ని గదుల్లో విద్యుత్‌ వైరింగ్‌ కూడా బాగుచేయడంతో పాటు పెయింటింగ్స్‌ కూడా వేయించనున్నట్లు వసతిగృహం సంక్షేమాధికారి ఎస్‌.రమేష్‌ తెలిపారు. దీంతో వసతిగృహం కొత్తకళ సంతరించుకొందంటూ ఇక్కడ ఉంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంటున్నారు.

బే వాచ్‌లో నిబంధనలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

గదులు నిర్మించి వాటిని పర్యాటకులకు అద్దెకు ఇస్తుండగా, వాటికి సంబంధించిన రికార్డుల విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని పేర్కొన్నారు. విజిటర్స్‌ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, అందులో వివరాలు నమోదు చేయకపోవడం గుర్తించారు. విశాఖపట్నానికి పర్యాటక సీజన్‌ నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారు. కానీ అక్కడ ఆ నెలల్లో కూడా రూమ్‌లు కేవలం 20 శాతం ఆక్యుపెన్సీ ఉన్నట్టు చూపించడంపై విచారణ అధికారి అనుమానం వ్యక్తంచేశారు. దీనిపై ఏపీటీడీసీ దృష్టి పెట్టాలని, దేశీ, విదేశీ పర్యాటకుల వివరాలు పక్కాగా నిర్వహించేలా చూడాలని సూచించారు.

సబ్‌ లీజ్‌ విషయం దాటవేత

అయితే కారణమేమిటో గానీ ఈ బే వాచ్‌ని వారు సబ్‌ లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నట్టు నివేదికలో ఎక్కడా ప్రస్తావించలేదు. వాస్తవానికి విజయవాడలోని ఏపీటీడీసీ అధికారులు దీనికి సంబంధించిన అంశాలపై వైసీపీ నాయకులకే నేరుగా మెయిల్స్‌ పంపి ఉత్తర, ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. కానీ విచారణాధికారి ఆ విషయం తొక్కిపెట్టారు. నిబంధనలు ఉల్లంఘించారని, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నివేదిక జిల్లా అధికారులకు చేరి సుమారు నాలుగు నెలలు పూర్తయింది. సబ్‌ లీజ్‌ రద్దు విషయం గానీ, భూ ఆక్రమణ తొలగింపు గానీ, మద్యం అధిక ధరల విక్రయంపై గానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

26లోగా నివేదిక ఇవ్వాల్సి ఉంది

పీతల మూర్తి యాదవ్‌ భీమిలి బీచ్‌లో సాయిరెడ్డి నిర్మాణంతో పాటు నాలుగు రెస్టారెంట్ల అక్రమ నిర్మాణాలపై కూడా ఫిర్యాదు చేశారు. వాటిపై కూడావిచారణ చేసి జిల్లా అధికారులు ఈ నెల 26వ తేదీలోగా నివేదిక ఇవ్వాలని హైకోర్టు రెండు రోజుల క్రితం ఆదేశించింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు బే వాచ్‌ అక్రమాలపై చర్యలు చేపడతారా? లేదాఅనేది చూడాలి.

ప్రభుత్వ భూమి కబ్జా

... 5వ పేజీ తరువాయి

ప్లాన్‌ లేకుండా కళ్యాణ మండపం నిర్మిస్తున్నట్టు గుర్తించి కొన్నాళ్ల కిందట యంత్రాలతో తొలగించేందుకు సిద్ధపడ్డారు. ఇంతలో వైసీపీ నేత కుమారుడు జోక్యం చేసుకోవడంతో టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు తొలగింపు పనులను మధ్యలోనే వదిలేసి వెనుతిరిగారు.

తర్వాత యథావిధిగా కళ్యాణ మండపం నిర్మాణపనులు జరిగిపోతున్నాయి. దీనిపై స్థానికులు కొందరు రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పట్టించుకోకపోవడంతో ఆ స్థలం, యాజమాన్య హక్కుల వివరాలను ఇవ్వాలంటూ సమాచార హక్కు చట్టం కింద కోరగా, అందులో కొంత ప్రభుత్వ స్థలం ఉన్నట్టు సమాధానం ఇచ్చారు. దాని ప్రకారం కళ్యాణ మండపం నిర్మాణాన్ని ఆపి, ప్రభుత్వ భూమిని సంరక్షించాలని కోరగా, రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తేనే చర్యలు తీసుకుటామని షరతు విధిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే తమను వైసీపీ నేత కుమారుడు ఏమైనా చేస్తారేమోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కళ్యాణ మండపం నిర్మించడంపై గాజువాక జోన్‌ టౌన్‌ప్లానింగ్‌ అధికారులను వివరణ కోరగా, పరిశీలించిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పడం విశేషం. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లోక్‌ అదాలత్‌లో 635 కేసులు పరిష్కారం

భీమునిపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భీమిలి కోర్టులలో నిర్వహించిన జాతీయ లోక్‌ అదాలత్‌లో 635 కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం ఒకటవ అదనపు జూనియర్‌సివిల్‌ జడ్జి కోర్టులో మెజిస్ట్రేట్‌ సౌజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే, భీమిలి ప్రిన్సిపల్‌ జూనియరు సివిల్‌ జడ్జి కోర్టు, 2వ అదనపు జూనియరు సివిల్‌ జడ్జి కోర్టులకు ఇన్‌ఛార్జిగా మెజిస్ట్రేట్‌ సౌజన్య వ్యవహరిస్తున్నారు. కాగా, ఈ మూడు కోర్టులలో మొత్తం 635 కేసులు పరిష్కారంతో రాజీ రుసుంగా రూ.27 లక్షల 21 వేలు లభించినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కోర్టు బార్‌ అసోషియేషన్‌ అధ్యక్షులు ఎంవీ పార్వతీశం, ఏజీపీ ఎం. సిహెచ్‌.పాత్రుడు, లోక్‌ అదాలత్‌ సభ్యుడు శంకర్‌కుమార్‌, భీమిలి పోలీసు ఎస్‌ఐ జి.హరీష్‌, పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సింహాచల వరాహ లక్ష్మీనృసింహునికి శనివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువన సుప్రభాత సేవ, ఆరాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతంగా స్వర్ణాభరణాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశాక మంగళవాయిద్యాల నడుమ భక్తులు ప్రదక్షిణ చేశారు. ఉదయం 9.30 గంటలకు నిత్యకల్యాణం జరిపి స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు.



తులసీ దళార్చన చేస్తున్న అర్చకుడు

మహిళల సాధికారతకు ప్రభుత్వం కృషి

మహారాణిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పలు రంగాలలో విశేష సేవలందించిన మహిళలను, పార్టీ మహిళా నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్‌ మహిళలకు ఆస్తిహక్కు, 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. మహిళా సంక్షేమం, సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. కూటమి పార్టీల విజయంలో మహిళలు కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు.



జిల్లా టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న మంత్రి డోలా, ఇతర నేతలు, మహిళలు

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తోట రత్నం, మహిళా నాయకులు కురిమిన లీలావతి, కేదారి లక్ష్మి ఎస్‌.అనంతలక్ష్మి, గనగళ్ల సత్యవతి, ఈతలపాక సుజాత, బోరా రాధాకుమారి, ముక్కా ఈశ్వరీ, ఈసారి వెంకటలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, సౌత్‌ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌, పొలమరశెట్టి శ్రీనివాసరావు, పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు టెన్త్‌ విద్యార్థుల పూజలు



పూజలో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో సింహాచల దేవస్థానం ఆధీనంలోని ఎస్‌డీఎస్‌హెచ్‌ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు శనివారం సింహాద్రినాథుని దర్శించుకుని పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయిని భాను సారథ్యంలో ఈ ఏడాది పది పరీక్షలు రాయనున్న 30 మంది విద్యార్థులు తమ హాల్‌ టికెట్లను అప్పన్న సన్నిధిలో ఉంచారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు కరుణ చూపాలని ప్రార్థించారు. ఆలయ అధికారులు విద్యార్థులకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఎన్‌ఆర్‌ఐ మహిళ మృతిపై మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశామని, ఆమె మృతికి కారణం ఏమిటనేది దర్యాప్తులో తేలుతుందని పేర్కొనడం గందరగోళానికి గురిచేసినట్టయింది. వాస్తవంగా ఆమెది ఆత్మహత్య అనుకుంటే ఆ విషయాన్ని మీడియా ప్రతినిధులు అడిగినప్పుడు దాచిపెట్టాల్సిన అవసరం ఉండదు. దీనిపై పోలీస్‌ అధికారులను వివరణ కోరితే బాధితులు సంపన్న వర్గానికి చెందినవారని, వారు తమ వివరాలను బయట పెట్టొద్దని కోరినందువల్లే చెప్పడం లేదని పేర్కొనడం విశేషం. ఇతరుల కుటుంబాల్లో ఇలాంటి విచారకరమైన ఘటనలు జరిగినప్పుడు పోలీసులు ఎందుకు ఇంత గోప్యత పాటించడం లేదనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

వైద్యుడు కూడా అమెరికా నుంచి రాక

కాగా మహారాణిపేటకు చెందిన 52 ఏళ్ల వైద్యుడు అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన నెల రోజుల కిందట నగరానికి వచ్చి హోటల్‌ మేఘాలయలో బస చేసినట్టు సమాచారం. 48 ఏళ్ల మహిళ కూడా చాలా ఏళ్ల కిందటే అమెరికాలో స్థిరపడ్డారు. ఇద్దరికీ వేర్వేరు వ్యక్తులతో వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ మహిళ ఈ నెల ఐదున అమెరికా నుంచి నగరానికి వచ్చి హోటల్‌ మేఘాలయలో ఎన్‌ఆర్‌ఐ వైద్యుడు బస చేసిన గదిలో ఉంటున్నట్టు సమాచారం. ద్వారకా నగర్‌ సమీపంలో ఒక స్థలం కొనుగోలు విషయమై ఆమె నగరానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈనెల ఆరున ఉదయం హోటల్‌ గదిలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఉంటుందని, ఆమె ఆవేశంతో బాత్‌రూమ్‌లోకి వెళ్లి అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అదే గదిలో ఉన్న ఎన్‌ఆర్‌ఐ వైద్యుడు హోటల్‌ సిబ్బందికి సమాచారం ఇచ్చి, వారి సహకారంతో తలుపులు బద్దలుకొట్టి లోపలకు వెళ్లిచూసేసరికి ఆమె విగతజీవిగా ఉన్నట్టు పోలీస్‌ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై సంబంధిత వైద్యుడిపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, అయితే పోలీసులు ఏం చేశారనేది తెలియాల్సి ఉంది.

ఘనంగా మహిళా దినోత్సవం

ఆనందపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గంభీరం పంచాయతీలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో స్నేహపూర్వక మహిళా గ్రామ పంచాయితీగా గంభీరాన్ని ఎంపికచేయడం అభినందనీయమన్నారు. జిల్లా పంచాయితీ అధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడారు. పలువురు గర్భిణులకు ఎంపీపీ ప్రియాంక, ఎంపీడీవో జానకి, సర్పంచి వానపల్లి లక్ష్మి సీమంతాలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

భీమునిపట్నం: మహిళల సంక్షేమానికి, భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కురిమిన లీలావతి అన్నారు. భీమిలి బీచ్‌రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. భీమిలి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు బోయి రమాదేవి మాట్లాడుతూ టీడీపీతోనే మహిళలకు రాజకీయ ప్రాధాన్యత పెరిగిందన్నారు. అనంతరం కురిమిన లీలావతిని మహిళలు ఘనంగా సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, తెలుగు మహిళ నాయకురాలు శతపతి మంగాదేవి, బోర రాధాకుమారి, పుక్కళ్ల లక్ష్మీకుమారి, పైడిపల్లి ఎల్లయ్యమ్మ, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.



భీమిలి టీడీపీ కార్యాలయంలో ఉత్సాహంగా కేకు కోస్తున్న తెలుగు మహిళలు

పద్మనాభం రూరల్‌: పురుషులకు దీటుగా మహిళలు ముందుకు సాగుతున్నారని గోస్నానీ విద్యా పీఠ్‌ వ్యవస్థాపకుడు కాళ్ల సూరిబాబు అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచి తాలాడ పాప, ఎంపీటీసీ. కె.లక్ష్మి, ఉపాధ్యాయినులు కలిసి పారిశుధ్య కార్మికులను సత్కరించి బహుమతులు అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చొరవ

... 5వ పేజీ తరువాయి

ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, జిల్లా కలెక్టర్‌ ఎం.ఎన్‌.హరేంధిర్‌ ప్రసాద్‌, నగర పోలీస్‌ కమిషనర్‌ శంఖబ్రత బాగ్చిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మహిళల పేరుతోనే మంజూరుచేస్తున్నదన్నారు. ఆర్థిక స్వావలంబన చేకూర్చుకునేందుకు 'షి ఆటో'లను, ద్విచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్నదన్నారు. మహిళల భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శక్తి యాప్‌ను ప్రారంభిస్తున్నారన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో స్వర్గీయ ఎన్టీఆర్‌ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు పనిచేస్తున్నారన్నారు. కలెక్టర్‌ ఎం.ఎన్‌.హరేంధిరప్రసాద్‌ మాట్లాడుతూ సెల్ఫ్‌ హెల్ప్‌ గ్రూపుల ద్వారా ప్రతి ఒక్క మహిళ ఆర్థికంగా స్థిరపడాలన్నారు. నగర పోలీస్‌ కమిషనర్‌ శంఖబ్రాత బాగ్చి మాట్లాడుతూ మహిళలకు ఏ సమస్య వచ్చినా తన వ్యక్తిగత నంబర్‌కు ఫోన్‌ చేయవచ్చునన్నారు. కార్యక్రమం అనంతరం స్వయం సహాయక సంఘాలకు చెక్కులను, లబ్ధిదారులకు స్కూటర్లను, ఆటోలను మంత్రి పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను అతిథుల చేతుల మీదుగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సీడ్స్‌ గ్రోవర్స్‌ ఛైర్మన్‌ గండి బాబ్జీ, చైల్డ్‌ వెల్ఫేర్‌ ఛైర్మన్‌ ఎం.రామలక్ష్మి రాధా, మహిళా శిశు సంక్షేమ శాఖ జేడీ చిన్నయిదేవి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడిగా త్రినాథరావు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్‌ఏ త్రినాథరావు మళ్లీ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అసోసియేట్ అధ్యక్షుడిగా డి.రాజేంద్రవర్మ, ఉపాధ్యక్షులుగా పి.శైలజ, ఎస్ఎం జిలానీ, జి.కిషోర్, పి.రామారావు, కార్యదర్శిగా పి.శ్యాంప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎ.సిద్ధార్థ, కోశాధికారిగా జి.రాజేశ్ ఎన్నికయ్యారు. అలాగే క్రీడల విభాగ కార్యదర్శిగా కె.అనిల్‌కుమార్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా బి.సుధాకర్, కె.త్రినాథరావు, ఎంఏ రామారావు, ఎ.గాయత్రి, కమిటీ సభ్యులుగాబీఎస్ఎస్ ప్రసాద్,కె.కల్యాణవర్మ, ఎం.నవీన్‌కుమార్, వి.గౌతం,ఎ.సుభద్ర, సీహెచ్ఏరాజు,ప్రసన్న,యాదమ్మ ఎన్నికయ్యారు.

రైలు ఢీకొని డాక్‌యార్డు ఉద్యోగి మృతి


మృతుడు జగన్ (ఫైల్‌ఫోటో)

గోపాలపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పాత గోపాలపట్నంలో చోటుచేసుకుంది. 89వ వార్డు ఎల్లపువానిపాలెం సంతోశ్‌నగర్ కాలనీలో డాక్‌యార్డు ఉద్యోగి పొలమరశెట్టి జగన్ (35) భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలప్పుడు జగన్ పాత గోపాలపట్నంలోని జువ్వాలమ్మ ఆలయానికి ఎల్లపువానిపాలెం రైల్వే ట్రాక్‌పై నుంచి నడుచుకుంటూ బయలుదేరారు. ఈ క్రమంలో జువ్వాలమ్మ ఆలయ సమీపంలో ట్రాక్‌పై వస్తున్న రైలును జగన్ గమనించకపోవడంతో ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. తమకు అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేరుకుని మృతదేహాన్నిపరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పి.4 సర్వేను విజయవంతం చేయాలి

పద్మనాభం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం లక్ష్యంగా పి-4సర్వేకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకరించి విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీవో ఎం. విజయ్ కుమార్ కోరారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకూ మండలంలో 22 పంచాయితీల్లో అన్ని గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించేందుకు, గ్రామ కార్యదర్శులను సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి అయా కుటుంబ సభ్యులవివరాలు, ఆర్థిక స్థితిగతులు సేకరిస్తారన్నారు.

సిటిజన్ సర్వీసెస్ అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

» ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి


మంత్రిశ్రీబాలవీరాంజనేయస్వామిని కలిసిన కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిటిజన్ సర్వీసెస్ అమలులో విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. శనివారం పోర్టు గెస్టు హౌసులో మంత్రిని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీ-4 సర్వే సమర్థవంతంగా సాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాలలో వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు సేవలు అందించేలా చూడాలన్నారు. బీచ్‌లో పారిశుధ్య నిర్వహణతో పాటు పర్యాటకులకు భద్రత కల్పించాలన్నారు. వేసవిలో జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

జిల్లాలో శాంతిభద్రతలు, పోలీసుల సేవలపై సీపీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రత్యేక గ్లకోమా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం గ్లకోమా వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీ అందుబాటులో ఉంటారన్నారు. కళ్లద్దాలు వాడుతున్న వారు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధ పడుతున్నవారు తప్పనిసరిగా ఈ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పారా మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో గ్లకోమా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు..

హోటల్ గ్రీన్ పార్కులో వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు


వస్త్ర ప్రదర్శనలో యువతి

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని గ్రీన్ పార్కులో విస్తృతశ్రేణి వస్త్రాలతో సంప్రదాయ ప్రదర్శన, అమ్మకాలు శనివారం ప్రారంభ మయ్యాయి. ఐదు రోజుల పాటు ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ ప్రదర్శనలో వస్త్రాలతో పాటు అనేక రకాల ఉప కరణాలు కూడా లభిస్తాయని, ఆకర్షనీయమైన విభిన్న రకాల డిజైన్లతో కూడిన దుస్తుల ప్రదర్శన- అమ్మకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వివాహాలకు అవసరమైన పట్టుచీరలు, కాటన్ వస్త్రాలు, సల్వార్‌లు, టాప్స్ వంటివెన్నో ప్రదర్శనలో ఉన్నాయన్నారు. పోచంపల్లి, కలంకారీ చీరలు, కోల్‌కతా, భాగల్‌పూరి ప్రింటులు, లక్నో చికాన్ వర్క్ చీరలు, బనారస్ పట్టుచీరలు, మగ్గాలపై నేసిన, రంగులు అద్దిన, ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయని వివరించారు. సంప్రదాయానికి పెద్దపీట వేసే వారికోసం పోచంపల్లి, వెంకటగిరి, ఉప్పాడ పట్టు చీరలు, కాటన్ చీరలు, బంగారం, వెండి జరీతో తయారైన కాంచీపురం పట్టుచీరలు తమ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు.

పోలీస్ శాఖ ప్రతిష్ఠలో మహిళా పోలీసుల పాత్ర అమోఘం

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి


మహిళా దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో బెలూన్లు ఎగురవేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పోలీస్‌శాఖ ప్రతిష్ఠ పెంచడంలో మహిళా పోలీసుల పాత్ర అమోఘమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. తమకు అందివచ్చిన అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని మహిళలు సత్తాచాటుతున్నారన్నారు.మహిళలు తమ ప్రతిభానైపుణ్యాలను నిరూపించుకోవడంతో సమాజంలో వివక్ష గతంతో పోల్చితే గణనీయంగా తగ్గిందన్నారు. ఒకవైపు ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉద్యోగాల్లో రాణిస్తుండడం మహిళల శక్తిసామర్థ్యాలకు నిదర్శనమన్నారు. పురుషులు అదే రీతిలో ఇంటిబాధ్యతలను నిర్వర్తించలేరని సీపీ అన్నారు. మగపిల్లలు కంటే ఆడపిల్లలే తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బాగాచూసుకుంటున్నారని, ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. అయితే, మహిళలపై దాడులు, అఘాయిత్యాలు ఇప్పటి కీ జరుగుతున్నాయని, అలాంటి అఘాయిత్యాలకు ఆస్కారం లేకుండా మహిళా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా భద్రతకు పూర్తిస్థాయి భరోసా కల్పించిన రోజు మాత్రమే ప్రతిరోజూ మహిళాదినోత్సవం జరుపుకున్నట్టవుతుందన్నారు. మహిళలపై సైబర్ దాడులు, భౌతికదాడులు లేకుండా చేసేందుకు ప్రతి మహిళా హోంగార్డు, కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐలతో పాటు మహిళా అధికారులంతా ప్రతి రోజూ పాఠశాలలు, కాలేజీలు, ఉద్యోగ కార్యాలయాలకు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసిన మహిళా పోలీసులకు ఆయన జ్ఞాపికలను అందజేశారు.

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీ ప్రశాంతి, లతామాధురి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఇంటికి వెళ్లి సీమంతం చేసిన రాష్ట్ర హోంమంత్రి అనిత


మహిళా కానిస్టేబుల్ రేవతికి సీమంతం చేస్తున్న రాష్ట్ర హోంమంత్రి వి.అనిత

మద్దిలపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తన ఉదార మనసును చాటుకున్నారు. శనివారం నిండు గర్భిణిగా ఉన్న మహిళా కానిస్టేబుల్ ఇంటికి వెళ్లి మరీ సీమంతం చేసి ఆశ్చర్యానికి గురి చేశారు. హోంమంత్రి ఇంటికి వచ్చి సీమంతం చేయడంతో సదరు మహిళా కానిస్టేబుల్ బావోద్వేగంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రేవతి ఎనిమిది నెలల గర్భిణి. ఆమె తన కుటుంబంతో శివాజీపాలెంలో నివాసముంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న హోంమంత్రి అనిత మహిళా దినోత్సవం నేపథ్యంల శనివారం రేవతి ఇంటికి వెళ్లారు. ఒక సోదరిలా రేవతికి పసుపు రాసి, చీర అందించి సీమంత్రం చేశారు. హోంమంత్రి అకస్మాత్తుగా ఇంటికి వచ్చి సీమంతం చేయడంతో రేవతి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. రేవతి ఆమె కుటుంబసభ్యులు ఆనంద బాష్పాలు నిండిన కళ్లతో హోంమంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానకులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు.

కనీస వేతనం రూ.26 వేలు చేయాలి

విమ్స్ ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల ఆందోళన



విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కాంట్రాక్టు శానిటేషన్ కార్మికులు

ఆరిలోవ, మార్చి8 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్టు శానిటేషన్ కార్మికులు శనివారం ఉదయం విమ్స్ ఆస్పత్రి మెయిన్ గేటువద్ద దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లాఅధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ మొదటి కరోనాలో అమలు చేసిన రూ.16 వేలరూపాయల జీతం, రెండో దఫా కరోనా 42 రోజులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం ఏ వన్ కాంట్రాక్టు అగ్రిమెంట్ ప్రకారం రూ.6,475 మాత్రం చెల్లించడం అన్యాయమన్నారు. తక్షణం రెండవ కరోనా సమయంలో ఇచ్చిన జీతం అమలు చేయాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేసారు. ప్రస్తుతం ఉన్న కార్మికులకు పని భారం పెరుగుతోందని, అదనంగా కార్మికులను నియమించాలన్నారు. ఆరిలోవ సీఐటీయూ నాయకులు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ రోజునకు కూడా ఈఎస్ఐ పేపర్లు ఇవ్వలేదన్నారు. జీతం, పీఎఫ్, ఈఎస్ఐ గురంచి అడిగితే కాంట్రాక్టు కార్మికులను వేధిస్తున్నారన్నారు. సెక్యూరిటీ కాంట్రాక్టు యూనియన్‌లో ఉంటే ఉద్యోగం తీసెస్తామని తప్పుడు ఆరోపణలతో సెక్యూరిటీ గార్డ్‌లను సూపర్ వైజర్ ద్వారా బెదిరించి ఉద్యోగాలను నిలుపుదల చేస్తున్నారని ఇది సరికాదన్నారు. తొలిగించిన సెక్యూరిటీ గార్డు తిరుపతిరావును తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టు తీసుకున్నపుడు టెండర్ నోటీఫికేషన్‌లోనే కార్మికులకి కార్మిక చట్టాలన్నీ అమలు చేయాలని ఉందన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా వేధిస్తున్న సెక్యూరిటీ కాంట్రాక్టర్‌ను విమ్స్ డైరెక్టర్ విచారణ చేసి ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విమ్స్ ఆసుపత్రి కాంట్రాక్టు శానిటేషన్ కార్మికుల అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌పార్వతి, వై.కనకరాజు, నగేష్, భాస్కర్‌తో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **ఛావా:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
● **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు)24, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 40, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 40, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 38 చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

'కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ తప్పుడు ప్రయత్నాలను అరికట్టాలి'

వెంకోజీపాలెం, మార్చి 08(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో విద్యార్థినిపై ప్రిన్సిపాల్ చేసిన దుర్మార్గపు చర్యను ఉన్నతాధికారులకు తెలియకుండా కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఉన్నతాధికారులు అరికట్టాలని, విద్యార్థికి న్యాయం చేయాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎయిడ్సో) విశాఖ అధ్యక్షుడు కె.అభిలాష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీబీఏ చదువుతున్న ఒక విద్యార్థిని కొద్ది రోజుల క్రితం యూనిఫాం ధరించకుండా కళాశాలకు వచ్చినందుకు ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు ఆ విద్యార్థిని మందలించడంతో పాటు, ఆమె ఫోటో తీసి కళాశాల అధ్యాపకుల గ్రూప్‌లో పెట్టిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. దీనిపై ఆ విద్యార్థిని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, ఈ నెల 12న విచారణ జరుపుతామని ఉన్నతాధికారులు తెలిపారన్నారు. ప్రస్తుతం ఆ ప్రిన్సిపాల్ వాస్తవాలను బయటకు రాకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు కూడా తెలుస్తోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ విద్యార్థి అయినా యూనిఫామ్ ధరించి రాకపోతే ఆ విద్యార్థితో మాట్లాడి, గుర్తింపజేసి, సరిదిద్దాలి తప్ప ప్రిన్సిపాల్ హోదాలో ఉన్న వ్యక్తి అమ్మాయి ఫోటో తీసి కళాశాల అధ్యాపకుల గ్రూప్‌లో పెట్టే అధికారం ఆయనకు ఉందా అని ప్రశ్నించారు. ఇలా చేయడం అందరి దృష్టిలో ఆ అమ్మాయిని అవమానించినట్టు అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధమైన చర్య ముఖ్యంగా అమ్మాయిల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందన్నారు. కాబట్టి ఈ నెల 12న జరగబోయే విచారణను నిష్పక్షపాతంగా జరిపి బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు. వాస్తవాలు బయటకు రాకుండా ప్రిన్సిపాల్ చేస్తున్న తప్పుడు ప్రయత్నాలను ఉన్నతాధికారులు దృష్టిలోకి తీసుకుని తగు ఆదేశాలను జారీ చేయాలని కోరారు.

రోప్ వే నిలిపివేత

» భద్రత ధ్రువపత్రాలు సమర్పించాకే మళ్లీ అనుమతి » నిర్వాహకులకు రూ.50 వేల జరిమానా
» కైలాసగిరిపై ప్రమాద స్థలాన్ని పరిశీలించిన వీఎంఆర్‌డీ చైర్మన్ ప్రణవ్ గోపాల్
» కొండపైకి డబుల్ డెక్కర్ బస్సు నడిపేందుకు గల అవకాశాలు పరిశీలించాలని అధికారులకు సూచన


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్, పక్కన జాయింట్ కమిషనర్ రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ తదితరులు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిపై శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించడంతో వీఎంఆర్‌డీఏ అధికారులు తాత్కాలికంగా రోప్ వేను నిలిపివేశారు. అగ్నిమాపక భద్రత ధ్రువపత్రం, యంత్రాలన్నీ బాగున్నాయని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించిన తరువాతే పునరుద్ధరిస్తామని స్పష్టంచేశారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ శనివారం కైలాసగిరికి వెళ్లి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రోప్ వే సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తెలుసుకొని, వారిని వివరణ కోరడంతో పాటు జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత కొండ మొత్తం తిరిగి మరిన్ని అడ్వంచర్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో డబుల్ డెక్కర్ బస్సులు లేవని, కైలాసగిరిపైకి పర్యాటకులతో నడిపేందుకు అవకాశాలు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

రూ.50 వేలు జరిమానా

రోప్ వే నిర్వాహకులకు రూ.50 వేలు జరిమానా విధిస్తూ వీఎంఆర్‌డీఏ సెక్రటరీ మురళీకృష్ణ ఆదేశాలు జారీచేశారు. గత జనవరి 20వ తేదీన రోప్‌వే స్థలాన్ని అధికారులు పరిశీలించినప్పుడు అక్కడ చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారని, ఆ ఆదేశాలను పాటించకుండా అగ్ని ప్రమాదం జరగడానికి ఆస్కారం కలిగించినందుకు రూ.50వేలు జరిమానా విధిస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారు.

వైసీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు


:కేక్ కట్ చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్న మహిళా నేతలు

మద్దిలపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ హరివెంకటకుమారి కేక్ కట్ చేసి మహిళలకు తినిపించారు. అనంతరం బండి ప్రియ, రాజ్యలక్ష్మి, కోసెట్టి రాజ్యలక్ష్మి, మీసాల సంధ్యలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ మహిళలకు నామినేటెడ్ పదవులు, పనులు కల్పించడంలో జగన్ పెద్ద పీట వేశారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు మోసం చేశారన్నారు. చంద్రబాబుకు మహిళలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గొట్టేటి మాధవి, తిప్పల గురుమూర్తిరెడ్డి, తైనాల విజయకుమార్, కెకె రాజు, జియ్యాని శ్రీధర్, పేడాడ రమణికుమారి, శోభహైమావతి, కృపా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సాధికారతకు ప్రభుత్వం కృషి

జిల్లా టీడీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి, తెలుగు మహిళలు

మహారాణిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పలు రంగాలలో విశేష సేవలందించిన మహిళలను, పార్టీ మహిళా నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిహక్కు, 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. మహిళా సంక్షేమం, సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. కూటమి పార్టీల విజయంలో మహిళలు కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తోట రత్నం, మహిళా నాయకులు కురిమిన లీలావతి, కేదారి లక్ష్మి, ఎస్.అనంతలక్ష్మి, గనగళ్ల సత్యవతి, ఈతలపాక సుజాత, బోరా రాధాకుమారి, ముక్కా ఈశ్వరీ, ఈసారి వెంకటలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, సౌత్ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మురళీనగర్: గ్రేటర్ 51వ వార్డులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్ని ఘనంగా జరిపారు. వార్డ్ సీనియరు నాయకులు టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఈతలపాక సుజాత హాజరై పారిశుధ్య కార్మికులను సత్కరించి నూతన దుస్తులు అందించారు. లలిత, పార్వతి, పేర్రాజు తదితరులు హాజరయ్యారు.

బహుముఖ పాత్రల పోషణ మహిళలకే సాధ్యం



ప్రసంగిస్తున్న లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం

డాబాగార్డెన్స్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నో రకాల పాత్రలు పోషించే శక్తిని భగవంతుడు కేవలం మహిళకు మాత్రమే ఇచ్చారని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సీతామాణిక్యం పేర్కొన్నారు. శనివారం పాత జైల్‌రోడ్డులోని పైడా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నారీ శక్తి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలో బేటీ బచావో...బేటీ పడావో ...స్త్రీశక్తిస్వరూప నృత్యాలు ఆలోచింపజేశాయి.

డాక్టర్ శశిప్రభకు ఘన సన్మానం

మహారాణిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా వేడుకలు ఐబీపీ సెంచూరియన్ క్లబ్‌లో గౌరవ కార్యదర్శి వాసిరెడ్డి శ్రీమంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన ప్రముఖ గైనకాలజీ వైద్యనిపుణురాలు డాక్టర్ ఆర్.శశిప్రభను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పండితుల వేద మంత్రాశీర్వచనం ఇచ్చారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు, వైద్య రంగానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జీ సరిగమప చాంపియన్ బేబి సాయి వేద వాగ్దేవి పాటలతో అలరించింది.



డాక్టర్ శశిప్రభను సత్కరిస్తున్న సెంచూరియన్ ప్రతినిధులు

మహిళా శక్తిని చాటండి



మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి ఎస్.రాంబాబు

డాబాగార్డెన్స్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అందరూ ఖండించాలని ఏపీ అండ్ టీబీఈఎఫ్ ముఖ్య కార్యదర్శి ఎస్.రాంబాబు కోరారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీయూబీఈఏ) మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో మహిళాశక్తిని చాటాలని కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఎం.ఎస్.షాలీని మీనన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకమన్నారు. ఆలిండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ శంకర్, అసోసియేషన్ ప్రతినిధులు లలిత జోషి, రిచాగాంధీ, స్వాతి, యూనియన్ బ్యాంక్ జనరల్ సెక్రటరీ ఉదయ్ కుమార్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగినుల ప్రదర్శన ఆకట్టుకుంది.

వాల్తేరు రైల్వేడివిజన్ కార్యాలయంలో...

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జోత్స్న బొహ్రా మాట్లాడుతూ మహిళా సాధికారితను ప్రోత్సహించడంలో వాల్తేరు డివిజన్ ముందుంటుందన్నారు. గీతం విశ్వవిద్యాలయం సీనియర్ ఎగ్జిక్యూటివ్ కీర్తి, డాక్టర్ రమ్యల పర్యవేక్షణలో సెమినార్‌లు నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై డాక్టర్ టి.అరుణ, హక్కులపై సీనియర్ న్యాయవాది అనురాధ పప్పు అవగాహన కల్పించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళలు అసాధారణ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, సీనియర్ డీపీవో ఇ.శాంతారామ్,డివిజన్ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు ఉన్నత స్థానం కల్పిస్తాం: వంశీకృష్ణ

సీతంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు ఉన్నత స్థానం కల్పిస్తామన్నారు. గౌరవ అతిథులుగా విచ్చేసిన డాక్టర్ హరిణి, డాక్టర్ రమ్య, డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సమస్యలను తెలుపుతూ వాటి నివారణకు పలు సూచనలు చేశారు. గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకులు జంగం జోషి, కోల శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో..

సీతంపేట: రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో వీర మహిళ లలిత ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని మహిళలను శాలువాలతో సన్మానించారు. సమాజంలో మార్పుకు నాంది పలికిన మహిళలను సత్కరించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వార్డు జనసేన అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు, చంటి, జనసేన వీర మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలవెల్లి సునీల్ గుప్తకు రూ.2,35,000 చెక్కును ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ జనసేన కార్యాలయంలో అందజేశారు.



మహిళను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అక్కయ్యపాలెం: రైల్వేన్యూకాలనీలో విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ హాజరయ్యారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయిని, అంతర్జాతీయ అవార్డు గ్రహీత అన్నమ్మ, రైల్వే న్యూ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణిలను సత్కరించారు. వందమంది మహిళలకు చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. 42వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, పాల్గొన్నారు. శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి పర్యావరణ చైర్మన్ రమేష్‌చంద్ జైన్ పాల్గొన్నారు. ఉపాధ్యాయినులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ప్రిన్సిపల్ ఎంవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ ఎం. శ్రీలక్ష్మి శైలజ పాల్గొన్నారు.

మహారాణిపేట: మెడికవర్ ఆసుపత్రి విమెన్ అండ్ చైల్డ్ విభాగంలో జరిగిన వేడుకల్లో గైనకాలజీ పిడియాట్రిక్ విభాగానికి చెందిన డాక్టర్ రాధిక, డాక్టర్ భూలక్ష్మి, డాక్టర్ విద్యారమా, డాక్టర్ గీతావందనలు పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యమే ప్రపంచానికి ఆరోగ్యం అంటూ వైద్య పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రూ.3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం



బాధితుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం బీజేపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.3 లక్షల చెక్కును బాధిత కుటుంబం పెన్మత్స సుబ్బారావుకి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శనివారం అందచేశారు. సీఎం చంద్రబాబు ఎక్కువ మందికి సీఎం సహాయ నిధిని అందజేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, సేవాతత్పరతతో ముందుకు సాగాలని బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక పేర్కొన్నారు. సీతమ్మధారలోని కెఎస్ఆర్ ఫంక్షన్ హాలుల్లో మహిళ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో సేవలందిస్తున్న, డ్వాక్రా మహిళలను శ్యామల దీపిక సన్మానించారు. మహిళలు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూసీడీ పీడి సత్యవేణి, ఏపీడీ పుణ్యవతి, అనురాధ, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సతీమణి సీత సుజాత, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ మహిళ మృతిపై మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశామని, ఆమె మృతికి కారణం ఏమిటనేది దర్యాప్తులో తేలుతుందని పేర్కొనడం గందరగోళానికి గురిచేసినట్టయింది. వాస్తవంగా ఆమెది ఆత్మహత్య అనుకుంటే ఆ విషయాన్ని మీడియా ప్రతినిధులు అడిగినప్పుడు దాచిపెట్టాల్సిన అవసరం ఉండదు. దీనిపై పోలీస్ అధికారులను వివరణ కోరితే బాధితులు సంపన్న వర్గానికి చెందినవారని, వారు తమ వివరాలను బయట పెట్టొద్దని కోరినందువల్లే చెప్పడం లేదని పేర్కొనడం విశేషం. ఇతరుల కుటుంబాల్లో ఇలాంటి విచారకరమైన ఘటనలు జరిగినప్పుడు పోలీసులు ఎందుకు ఇంత గోప్యత పాటించడం లేదనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

వైద్యుడు కూడా అమెరికా నుంచి రాక

కాగా మహారాణిపేటకు చెందిన 52 ఏళ్ల వైద్యుడు అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన నెల రోజుల కిందట నగరానికి వచ్చి హోటల్ మేఘాలయలో బస చేసినట్టు సమాచారం. 48 ఏళ్ల మహిళ కూడా చాలా ఏళ్ల కిందటే అమెరికాలో స్థిరపడ్డారు. ఇద్దరికీ వేర్వేరు వ్యక్తులతో వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. ఎన్ఆర్ఐ మహిళ ఈ నెల ఐదున అమెరికా నుంచి నగరానికి వచ్చి హోటల్ మేఘాలయలో ఎన్ఆర్ఐ వైద్యుడు బస చేసిన గదిలో ఉంటున్నట్టు సమాచారం. ద్వారకా నగర్ సమీపంలో ఒక స్థలం కొనుగోలు విషయమై ఆమె నగరానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈనెల ఆరున ఉదయం హోటల్ గదిలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఉంటుందని, ఆమె ఆవేశంతో బాత్‌రూమ్‌లోకి వెళ్లి అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అదే గదిలో ఉన్న ఎన్ఆర్ఐ వైద్యుడు హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చి, వారి సహకారంతో తలుపులు బద్ధలుకొట్టి లోపలకు వెళ్లిచూసేసరికి ఆమె విగతజీవిగా ఉన్నట్టు పోలీస్ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై సంబంధిత వైద్యుడిపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, అయితే పోలీసులు ఏం చేశారనేది తెలియాల్సి ఉంది.

ముగిసిన నవగ్రహ ప్రతిష్ఠ

మురళీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 49వవార్డులో గౌరీరామలింగేశ్వర ఆలయంలో ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్న నవగ్రహ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం 8 గంటలకు నవరత్న న్యాస సంకల్పం, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ పూజల్ని అర్చకులు ఎ.సాయికుమార్ శర్మ చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద గ్రామ వాస్తవ్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.రమణ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరుని పరస మహోత్సవం

కంచరపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిక్కవానిపాలెంలో కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామి వారి వార్షిక పరస మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, విశిష్ట పుష్పాలంకరణ చేశారు. అర్చకులు రామకృష్ణ శర్మ, పూర్వ అర్చకులు చామర్తి శంకర, జగన్నాథ శర్మల నేతృత్వంలో సహస్ర నామార్చనలు జరిగాయి.

సుగుణ ఆత్మహత్య కేసులో ఇద్దరు మహిళల అరెస్టు

మహారాణిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించి ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. అచ్చియ్యమ్మపేటలో బి.సుగుణ అనే మహిళ తనకు అప్పు ఇచ్చిన వారి ఇంటిలోనే ఈ నెల 6న ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులు ఉమ్మడి ధనలక్ష్మి, వాసుపల్లి నూకరత్నంలను అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జా

... 5వ పేజీ తరువాయి

ప్లాన్ లేకుండా కళ్యాణ మండపం నిర్మిస్తున్నట్టు గుర్తించి కొన్నాళ్ల కిందట యంత్రాలతో తొలగించేందుకు సిద్ధపడ్డారు. ఇంతలో వైసీపీ నేత కుమారుడు జోక్యం చేసుకోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగింపు పనులను మధ్యలోనే వదిలేసి వెనుతిరిగారు.

యథావిధిగా నిర్మాణం

తర్వాత యథావిధిగా కళ్యాణ మండపం నిర్మాణపనులు జరిగిపోతున్నాయి. దీనిపై స్థానికులు కొందరు రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పట్టించుకోకపోవడంతో ఆ స్థలం, యాజమాన్య హక్కుల వివరాలను ఇవ్వాలంటూ సమాచార హక్కు చట్టం కింద కోరగా, అందులో కొంత ప్రభుత్వ స్థలం ఉన్నట్టు సమాధానం ఇచ్చారు. దాని ప్రకారం కళ్యాణ మండపం నిర్మాణాన్ని ఆపి, ప్రభుత్వ భూమిని సంరక్షించాలని కోరగా, రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తేనే చర్యలు తీసుకుటామని షరతు విధిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే తమను వైసీపీ నేత కుమారుడు ఏమైనా చేస్తారేమోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కళ్యాణ మండపం నిర్మించడంపై గాజువాక జోన్ టౌన్‌ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా, పరిశీలించిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పడం విశేషం. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేదుల దంపతులకు సీతారామమ్మ స్మారక పురస్కారం

సీతంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ సాహితి, గండికోట సాహితీ పీఠం సంయుక్తంగా గండికోట బ్రహ్మాజీరావు, సీతారామమ్మ స్మారక సాహితి పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది. విశాఖ సాహితి అధ్యక్షులు ఆచార్య మలయవాసిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆయన సతీమణి ప్రభావతి దంపతులకు అతిథుల చేతుల మీదుగా సాహితీ పురస్కారం అందచేశారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన మహిళామూర్తులను సత్కరించారు. ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆచార్య అయ్యగారి సీతారత్నం, డాక్టర్ డి.వి. సూర్యారావు, శంకర నీలు భాగవతులు తదితరులు పాల్గొన్నారు.



బాల క్రీడాకారులకు ఫుట్‌బాల్ కిట్ల పంపిణీ

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో శనివారం సాయంత్రం బాల క్రీడాకారులకు ఫుట్‌బాల్ కిట్లు పంపిణీ చేశారు. నగరంలోని కంచరపాలెం, కోటవీధి ప్రాంతాలలో ఫుట్‌బాల్ సాధన చేస్తున్న బాల క్రీడాకారులను జేఏఎస్‌పీ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్ సంస్థ ప్రోత్సహిస్తూ వారికి ఫుట్‌బాల్ షూస్, జెర్సీ సెట్, బాల్స్ అందజేసింది. శనివారం జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర గ్రాస్ రూట్స్ కన్వీనర్ సుస్మిత, జెఏఎస్‌పీ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్ సీఈవో శరణ్య ముఖ్య అతిథులుగా హాజరై బాలలకు కిట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, చిత్తశుద్ధితో సాధన చేసి ఉన్నత స్థాయి క్రీడాకారులుగా రూపొందాలని సూచించారు. కోచ్‌లు కూడా ప్రత్యేక దృష్టి సారించి ప్రతిభ గల చిన్నారులను గుర్తించి ఉత్తమ ఫుట్‌బాలర్లగా తీర్చిదిద్దాలని, దానికి తగిన సహాయ సహకారాలందిస్తామన్నారు. ఎస్.జి.రామకృష్ణ, త్రినాథరావు (బాబు), మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందుకున్న బాల ఫుట్‌బాలర్లతో ప్రముఖులు

బే వాచ్‌లో నిబంధనలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

గదులు నిర్మించి వాటిని పర్యాటకులకు అద్దెకు ఇస్తుండగా, వాటికి సంబంధించిన రికార్డుల విషయంలో నిబంధనలు పాటించడం లేదని పేర్కొన్నారు. విజిటర్స్ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, వివరాలు నమోదు చేయకపోవడం గుర్తించారు. విశాఖపట్నానికి నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారు. కానీ ఆ నెలల్లో కూడా రూమ్‌లు కేవలం 20 శాతం ఆక్యుపెన్సీ ఉన్నట్టు చూపించడంపై విచారణ అధికారి అనుమానం వ్యక్తంచేశారు. దీనిపై ఏపీటీడీసీ దృష్టి పెట్టాలని, దేశీ, విదేశీ పర్యాటకుల వివరాలు పక్కాగా నిర్వహించేలా చూడాలన్నారు.

సబ్ లీజ్ విషయం దాటవేత

అయితే కారణమేమిటో గానీ ఈ బే వాచ్‌ని వారు సబ్ లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నట్టు నివేదికలో ఎక్కడా ప్రస్తావించలేదు. వాస్తవానికి విజయవాడలోని ఏపీటీడీసీ అధికారులు దీనికి సంబంధించిన అంశాలపై వైసీపీ నాయకులకే నేరుగా మెయిల్స్ పంపి ఉత్తర, ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. కానీ విచారణాధికారి ఆ విషయం తొక్కిపెట్టారు. నిబంధనలు ఉల్లంఘించారని, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నివేదిక జిల్లా అధికారులకు చేరి సుమారు నాలుగు నెలలు పూర్తయింది. సబ్ లీజ్ రద్దు విషయం గానీ, భూ ఆక్రమణ తొలగింపు గానీ, మద్యం అధిక ధరల విక్రయంపై గానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

26లోగా నివేదిక ఇవ్వాల్సి ఉంది

పీతల మూర్తి యాదవ్ భీమిలి బీచ్‌లో సాయిరెడ్డి నిర్మాణంతో పాటు నాలుగు రెస్టారెంట్ల అక్రమ నిర్మాణాలపై కూడా ఫిర్యాదు చేశారు. వాటిపై విచారణ చేసి జిల్లా అధికారులు ఈ నెల 26లోగా నివేదిక ఇవ్వాలని హైకోర్టు రెండు రోజుల క్రితం ఆదేశించింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు బే వాచ్ అక్రమాలపై చర్యలు చేపడతారా? లేదా అనేది చూడాలి.





వైభవంగా యల్లమ్మ జాతర



పోతురాజు పుట్టవద్ద మహిళల పూజలు

మహారాణిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట గ్రామ దేవతగా పిలుచుకునే యల్లమ్మతల్లి మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. పాతనగరంలోని పప్పులవీధి, జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంటిలో ఉన్న సదకం చదును పట్టు వద్ద యల్లమ్మకు సోదరుడు అయిన పోతురాజుకు ఉపారం సమర్పించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా అమ్మవారిని అర్ధరాత్రి యల్లమ్మతోట వద్దకు తీసుకు వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం జాతర మహోత్సవాన్ని ప్రారంభించారు. దిబ్బలపాలెం, చండకవీధి, అంగటిదిబ్బ, కనకలవీధి, గొల్లలపాలెం, తాడివీధి, చెంగల్రావుపేట తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి దర్శనాలు చేసుకున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మాలధారణ భక్తులు అగ్ని గుండం తొక్కారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని వారి నుంచి రూ.92,500 విలువ చేసే 18.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్.బిశోయ్ తమ సిబ్బందితో శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన గోబర్ధన టిక్రి, చంద్ర సాంగి అనే నిందితులు ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తూ దొరికారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు

సీతమ్మధార, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ప్రధాన రహదారి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సీసీ కెమెరాలను మరమ్మతు చేశారు. ఈ రహదారిలో జరిగే ఎలాంటి ఘటన అయినా రికార్డు చేసేలా అమర్చిన సీసీ కెమెరాలు పనిచేయలేదు. ట్రాఫిక్ నిబంధనలపై కొరడా ఝుళిపిస్తున్న నేపథ్యంలో వీటి అవసరం ఉంది.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చొరవ

... 5వ పేజీ తరువాయి

ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మహిళల పేరుతోనే మంజూరుచేస్తున్నదన్నారు. ఆర్థిక స్వావలంబన చేకూర్చుకునేందుకు షి ఆటోలను, ద్విచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్నదన్నారు. మహిళల భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శక్తి యాప్‌ను ప్రారంభిస్తున్నారన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు పనిచేస్తున్నారన్నారు.

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా ప్రతి ఒక్క మహిళ ఆర్థికంగా స్థిరపడాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రాత బాగ్చి మాట్లాడుతూ మహిళలకు ఏ సమస్య వచ్చినా తన వ్యక్తిగత నంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు. కార్యక్రమం అనంతరం స్వయం సహాయక సంఘాలకు చెక్కులను, లబ్ధిదారులకు స్కూటర్లను, ఆటోలను మంత్రి పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ గ్రోవర్స్ చైర్మన్ గండి బాబ్జీ, చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.రామలక్ష్మి రాధా, మహిళా శిశు సంక్షేమ శాఖ జేడీ చిన్నయిదేవి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన కలెక్టర్, సీపీ

'సిటిజన్ సర్వీసెస్'లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

ఇన్‌చార్జి మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిటిజన్ సర్వీసెస్ అమలులో విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. శనివారం పోర్టు గెస్టు హౌసులో మంత్రిని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీ-4 సర్వే సమర్థవంతంగా సాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు సేవలందించేలా చూడాలన్నారు. బీచ్‌లో పారిశుధ్య నిర్వహణతో పాటు పర్యాటకులకు భద్రత కల్పించాలన్నారు. వేసవిలో జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతలు, పోలీసుల సేవలపై సీపీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆటుపోట్లను గెలిచి నిలిచిన పార్టీ జనసేన

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలం పాటు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని గెలిచి నిలిచిన జనసేన పార్టీ భవిష్యత్తులో దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనున్నదని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఈ నెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు సన్నద్ధంపై శనివారం సుజాతనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ వంద శాతం స్ట్రైక్ రేటుతో దేశం మొత్తం జనసేన వైపు చూసేలా అధినేత పవన్ చేశారన్నారు. ప్రశ్నించే హక్కును గుర్తు చేసి, సిద్ధాంతాలతో ప్రజల పక్షాన జనసేన నిలిచిందన్నారు పార్టీ ఆవిర్భావ సభను అందరూ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆవిర్భావ సభ పోస్టరును ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు అయిత సింహాచలం, వేగి దివాకర్, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, సేనాపతి సోమశేఖర్, డీబీఎల్ నాయుడు, కె.మధు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 40, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 40, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)6, అల్లం (పాతది)50, బరబాటి 34, మునక్కాడలు (కిలో) 60, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 28, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 42, కంద 64, గోరుచిక్కుడు 36, దేముడుచిక్కుడు 62, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170



మహిళలను సత్కరించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు



కేక్ కట్ చేసి జనసేన వీరమహిళకు తినిపిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు
- మహిళా సాధికారితకు కట్టుబడి ఉన్నాం: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల
- కుటుంబానికి మహిళలే వెన్నుముఖ: పోక్సో కోర్టు జడ్జి ఆనంది
- పలుచోట్ల ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

గోపాలపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకంగా మారిందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తమ నివాసంలో పలు వృత్తుల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం గణబాబు మాట్లాడుతూ దేశంలోని అన్ని రంగాలలో మహిళలు చేస్తున్న సేవలు శ్లాఘనీయమైనవన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెందుర్తి: మహిళా సాధికారికతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెందుర్తి నియోజకవర్గానికి చెందిన జనసేన వీరమహిళలు నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి వీర మహిళలకు తినిపించి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొట్టా సూర్యకుమారి, వీర మహిళలు పిన్నింటి పార్వతి, పద్మ, మడక గౌరి, నాగసుధ, వరూధిని, హైమవతి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా నేత నాదెళ్ల జ్యోతి కేక్ కట్ చేశారు. విభిన్న రంగాల్లో ప్రతిభ చూపుతున్న మహిళలను సత్కరించారు. చినముషిడివాడలోని వార్డు కార్యాలయంలో మహిళా పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ సేనాపతి వసంత చీరలు పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నేత సేనాపతి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: ఏ కుటుంబానికి అయిన మహిళే వెన్నుముఖ అని పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనంది అన్నారు. ప్లాం టులో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంతో పాటు పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. మహిళా, పోక్సో చట్టాలు, జువైనల్ జస్టిస్ సిస్టమ్ వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉక్కు జీఎం ఎన్.భాను, డీజీఎం జి.శేషమ్మ, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ జి.జయదేవి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టీల్‌ప్లాంటులో బీఎంఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రోలింగ్ మిల్స్ జోనల్ హెచ్ఆర్ మేనేజర్ మనోజ మాట్లాడుతూ మహిళల్లో నాయకత్వ లక్షణాలు చాలా ముఖ్యమని, మహిళా ఉద్యోగులు సంస్థల అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదన్నారు. ఎంఎంఎస్ఎం హెచ్‌వోడీ ఫైబల్ సేన్, బీఎంఎస్ ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



ప్లాంటులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పోక్సో జడ్జి ఆనంది



దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న మహిళా సిబ్బంది

పెదగంట్యాడ: సింహగిరి ఆస్పత్రి ఆవరణలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి బీపీ, షుగర్, హెచ్‌బీ, థైరాయిడ్ వంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆస్పత్రి ఎండీ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కేవీ కల్యాణ్, సింహగిరి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు జమునారాణి, తదితరులు పాల్గొన్నారు. మహిళలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వేపగుంట: నాయుడుతోట సాయిమాధవనగర్‌లోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి పురోగతిలో, వైద్య రంగంలో, సేవా రంగంలో వివిధ హోదాల్లో మహిళలు తమ శక్తిని ప్రదర్శించి ఉన్నతికి కృషి చేశారన్నారు. అనంతరం మహిళా డాక్టర్లు, సీనియర్ మహిళా వైద్యులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ నశ్రీన్, శిరీష, సీత, సువర్ణ సీత, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెంలోని బ్రహ్మర్షి పిరమిడ్ శక్తి క్షేత్రంలో మహిళలు, విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. 97వ వార్డు కార్పొరేటరు శానాపతి వసంత శంకరరావు, ప్రముఖ డాక్టర్ ఎస్.లక్ష్మి, డాక్టర్ బి.రమలను సత్కరించారు. పిరమిడ్ వ్యవస్థాపకులు పి.ఈశ్వరమ్మ, ఎం.ఆత్మానందం, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు తులసి, మంగ, రమణేశ్, సోమేశ్వరరావు, మాధురి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారని, సమాజంలో స్త్రీ లేనిదే ఈ ప్రపంచమే లేదనేలా ఉందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గాజువాక ఆర్టీసీ డిపోలో జరిగిన జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మణిపూర్ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాజువాక డిపో ప్రధాన కార్యదర్శి పీలా శంకరరావు, ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి సత్యవతి, ఆర్టీసీ ఆర్ఎం అప్పలరాజు, డిపో మేనేజర్ ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా అధికారులను గణబాబు సత్కరించారు. అలాగే 61వ వార్డు పరిధి జాలరి వీధి సామాజిక భవనంలో సుమారు 50 మంది మహిళలను టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ ఆధ్వర్యంలో గణబాబు సత్కరించారు. ఐద్వా ఆధ్వర్యంలో శ్రీహరిపురం నుంచి మల్కాపురం వరకు ర్యాలీ చేపట్టారు. అదేవిధంగా షిప్‌యార్డులో సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ కేక్ కట్ చేసి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఎస్ఎల్ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు వందన, తదితరులు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి, కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేస్లీన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 92వ వార్డు జనతా కాలనీలో జనతా మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షురాలు ఎం.విమల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ సభ్యులు, మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: సృష్టికి మూలం స్త్రీ అని, మహిళలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు అన్నారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బందితో ఆయన కేక్ కట్ చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది సుశీల, స్పందన, ప్రతిమ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: మహిళలు విద్యావంతులైతే తన కుటుంబంతో పాటు సమాజాన్ని అభివృద్ధి చేయగలరని గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి నవ్యాంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పూడి శాంతి, డాక్టర్ వరలక్ష్మి, లాయర్ యశోద, సంధ్రాన నిహారిక, గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు. మహిళా మండలి సంక్షేమానికి నిహారిక రూ.20 వేలను అందజేశారు.

ఆటోనగర్: గ్రేటర్ 71వ వార్డు శ్రీనగర్‌లో టీఎస్సార్ టీబీకే కళాశాల, యాపిల్ స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ మహిళలే మానవ జాతికి నిజమైన సంపద అని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయినులను సత్కరించడంతో పాటు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ ఎస్.విష్ణువర్ధనరావు, మురళీమోహన్, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే 71 వార్డులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో సీనియర్ ఉపాధ్యాయినులను చైర్మన్ పి.అనిత సత్కరించారు. స్కూల్ ఇన్‌చార్జి సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చేపట్టిన ర్యాలీలో కూరగాయలు విక్రయించే మహిళలకు గులాబీ పువ్వులిచ్చి అభినందనలు తెలిపారు.

అగనంపూడి: కృషి, పట్టుదల, ధైర్యం, ఉంటే ఏదైనా సాధించవచ్చని స్విమ్మింగ్ క్రీడాకారిణి గోలి శ్యామల అన్నారు. స్థానిక గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కష్టపడితే అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం శ్యామలను గొన్నా కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి హేమ్‌చంద్‌నాయుడు, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు. స్థానిక సత్రం జంక్షన్‌లోని మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులను సన్మానించారు. టీడీపీ 79వ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ ఆధ్వర్యంలోనూ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దిశ ఏసీపీ పి.పెంటారావు పాల్గొని మహిళా అధ్యాపకులను సత్కరించారు. మహిళా సీఐ మల్లేశరి, డాక్టర్ రాధిక, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్, పక్కన జాయింట్ కమిషనర్ రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ తదితరులు

రోప్‌వే నిలిపివేత

- భద్రత ధ్రువపత్రాలు సమర్పించాకే మళ్లీ అనుమతి
- నిర్వాహకులకు రూ.50 వేల జరిమానా
- కైలాసగిరిపై ప్రమాద స్థలాన్ని పరిశీలించిన వీఎంఆర్‌డీ చైర్మన్ ప్రణవ్ గోపాల్
- కొండపైకి డబుల్ డెక్కర్ బస్సు నడిపేందుకు గల అవకాశాలు పరిశీలించాలని అధికారులకు సూచన

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించడంతో వీఎంఆర్‌డీఏ అధికారులు తాత్కాలికంగా రోప్ వేను నిలిపివేశారు. అగ్నిమాపక భద్రత ధ్రువపత్రం, యంత్రాలన్నీ బాగున్నాయని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించిన తరువాతే పునరుద్ధరిస్తామని స్పష్టంచేశారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ శనివారం కైలాసగిరికి వెళ్లి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రోప్ వే సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తెలుసుకొని, వారిని వివరణ కోరడంతో పాటు జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత కొండ మొత్తం తిరిగి మరిన్ని అడ్వంచర్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో డబుల్ డెక్కర్ బస్సులు లేవని, కైలాసగిరిపైకి పర్యాటకులతో నడిపేందుకు అవకాశాలు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

రూ.50 వేలు జరిమానా

రోప్ వే నిర్వాహకులకు రూ.50 వేలు జరిమానా విధిస్తూ వీఎంఆర్‌డీఏ సెక్రటరీ మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. గత జనవరి 20వ తేదీన రోప్‌వే స్థలాన్ని అధికారులు పరిశీలించినప్పుడు అక్కడ చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారని, ఆ ఆదేశాలను పాటించకుండా అగ్ని ప్రమాదం జరగడానికి ఆస్కారం కలిగించినందుకు రూ.50వేలు జరిమానా విధిస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారు. వారం రోజుల్లో చెల్లించాలని సూచించారు.

రైలు ఢీకొని డాక్‌యార్డు ఉద్యోగి మృతి

గోపాలపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పాత గోపాలపట్నంలో చోటుచేసుకుంది. 89వ వార్డు ఎల్లపువానిపాలెం సంతోశ్‌నగర్ కాలనీలో డాక్‌యార్డు ఉద్యోగి పొలమరశెట్టి జగన్ (35) భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలప్పుడు జగన్ పాత గోపాలపట్నంలోని జువ్వాలమ్మ ఆలయానికి ఎల్లపువానిపాలెం రైల్వే ట్రాక్‌పై నుంచి నడుచుకుంటూ బయలుదేరారు. ఈ క్రమంలో జువ్వాలమ్మ ఆలయ సమీపంలో ట్రాక్‌పై వస్తున్న రైలును జగన్ గమనించకపోవడంతో ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. తమకు అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన పి.జగన్ (ఫైల్ ఫొటో)

పాత్రికేయుని ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేసిన ముగ్గురిపై కేసు

కూర్మన్నపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఓ పాత్రికేయుని ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేసిన ముగ్గురిపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి గళ్లవానిపాలెంలో నివాసం ఉంటున్న ఓ చిన్న పత్రిక ఎడిటర్ గొడబ రామారావు (రాంబాబు) గాజువాకలో గెడ్డను ఆక్రమించి వాణిజ్య సముదాయాలను నిర్మిస్తున్నారంటూ వార్త రాశారు. దీంతో సదరు నిర్వాహకులు శుక్రవారం రాంబాబు ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన లేకపోవడంతో కుటుంబ సభ్యులపై దాడికి యత్నించి, భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై శుక్రవారం రాత్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాకకు చెందిన నూనెల వెంకటలక్ష్మి, నూనెల రాధాకృష్ణ, అంకాని సురేశ్‌కుమార్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రల్ ఐలాండ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

గాజువాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి వంటిల్ల జంక్షన్ వద్ద సుమారు రూ.కోటీ పది లక్షల వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ ఐలాండ్ ఆధునికీకరణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గాజువాక భూ సమస్యకు త్వరలోనే మోక్షం లభించనున్నదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, గంధం శ్రీనివాసరావు, నాయకులు ఎస్.అనంత్, జి.వెంకటరమణ, లక్ష్మణరావు, బి.బాలునాయుడు, ఎన్.సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

47 మంది మందుబాబులకు జరిమానా

కూర్మన్నపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 47 మంది మందుబాబులను పోలీసులు శనివారం లోక్ అదాలత్ ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. దీంతో మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం 47 మందికి కలిపి రూ.4,70,000 జరిమానా విధించినట్టు దువ్వాడ ట్రాఫిక్ సీఐ వెంకటరావు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

సింధియా, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌కు చెందిన ధర్మరెడ్డి సత్యవేణికి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,42,780 చెక్కును శనివారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అందజేశారు. అలాగే ఇదే ప్రాంతానికి చెందిన గంగడి కుమారికి రూ.90,000 చెక్కును అందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు కూడా వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పోలీస్ శాఖ ప్రతిష్ఠ పెంపులో మహిళా సిబ్బంది పాత్ర అమోఘం

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పోలీస్‌శాఖ ప్రతిష్ఠ పెంచడంలో మహిళా పోలీసుల పాత్ర అమోఘమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషలతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. తమకు అందివచ్చిన అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని మహిళలు సత్తాచాటుతున్నారన్నారు. మహిళలు తమ ప్రతిభానైపుణ్యాలను నిరూపించుకోవడంతో సమాజంలో వివక్ష గతంతో పోల్చితే గణనీయంగా తగ్గిందన్నారు. ఒకవైపు ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉద్యోగాల్లో రాణిస్తుండడం మహిళల శక్తిసామర్థ్యాలకు నిదర్శనమన్నారు. పురుషులు అదే రీతిలో ఇంటిబాధ్యతలను నిర్వర్తించలేరని సీపీ అన్నారు. మగపిల్లలు కంటే ఆడపిల్లలే తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బాగాచూసుకుంటున్నారని, ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. అయితే, మహిళలపై దాడులు, అఘాయిత్యాలు ఇప్పటికీ జరుగుతున్నాయని, అలాంటి అఘాయిత్యాలకు ఆస్కారం లేకుండా మహిళా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా భద్రతకు పూర్తిస్థాయి భరోసా కల్పించిన రోజు మాత్రమే ప్రతిరోజూ మహిళాదినోత్సవం జరుపుకున్నట్టవుతుందన్నారు. మహిళలపై సైబర్‌దాడులు, భౌతికదాడులు లేకుండా చేసేందుకు ప్రతి మహిళా హోంగార్డు, కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐలతో పాటు మహిళా అధికారులంతా ప్రతిరోజూ పాఠశాలలు, కాలేజీలు, ఉద్యోగ కార్యాలయాలకు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసిన మహిళా పోలీసులకు ఆయన జ్ఞాపికలను అందజేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీ ప్రశాంతి, లతామాధురి తదితరులు పాల్గొన్నారు.

హోటల్ గ్రీన్ పార్కులో వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని గ్రీన్ పార్కులో విస్తృత శ్రేణి వస్త్రాలతో సంప్రదాయ ప్రదర్శన, అమ్మకాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో వస్త్రాలతో పాటు అనేక రకాల ఉపకరణాలు కూడా లభిస్తాయని, ఆకర్షణీయమైన విభిన్న రకాల డిజైన్లతో కూడిన దుస్తుల ప్రదర్శన- అమ్మకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వివాహాలకు అవసరమైన పట్టుచీరలు, కాటన్ వస్త్రాలు, సల్వార్‌లు, టాప్స్ వంటివెన్నో ప్రదర్శనలో ఉన్నాయన్నారు. పోచంపల్లి, కలంకారీ చీరలు, కోల్‌కతా, భాగల్‌పురి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్ చీరలు, బనారస్ పట్టుచీరలు, మగ్గాలపై నేసిన, రంగులు అద్దిన, ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయని వివరించారు. సంప్రదాయానికి పెద్దపీట వేసే వారికోసం పోచంపల్లి, వెంకటగిరి, ఉప్పాడ పట్టు చీరలు, కాటన్ చీరలు, బంగారం, వెండి జరీతో తయారైన కాంచీపురం పట్టుచీరలు తమ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు.



వస్త్ర ప్రదర్శనలో యువతి